సాక్షి
ఖమ్మం
బుధవారం। 10। జనవరి। 2024



విద్యుత్ కేంద్రం విస్తరించేనా?
పాల్వంచలోని కేటీపీఎస్‌లో అన్ని వనరులు ఉన్నందున మరో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 8లో



జోరుగా.. హుషారుగా..
భద్రాచలంలో గిరిజన విద్యాసంస్థల ఇగ్నైట్ ఫెస్ట్ అటు కళాప్రదర్శనలు, ఇటు ఎగ్జిబిట్లతో ఉత్సాహంగా కొనసాగుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 19°
వాతావరణం
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుముఖం పట్టే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/కూసుమంచి: రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈమేరకు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని గురుదక్షిణ ఫౌండేషన్ ఆవరణలో మొక్కలు నాటాక ఖమ్మంలో భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే అభినందన సభలో పాల్గొంటారు. ఆతర్వాత ఖమ్మం రూరల్ మండలంలోని మల్లెమడుగు, ఏదులాపురం, కొండాపురంల్లో ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రారంభించి కూసుమంచిలోని క్యాంపు కార్యాలయాన్ని సందర్శిస్తారు. ఈమేరకు క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాట్లను మంగళవారం ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్ పరిశీలించగా నాయకులు మాదాసు ఉపేందర్, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, ఎడవెల్లి రాంరెడ్డి, బారి వీరభద్రం, బెల్లంకొండ వెంకన్న, చాట్ల సత్యనారాయణ, అర్వపల్లి మల్లికార్జున్, మహిపాల్, రఫీ పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో జరిగే సమావేశానికి మంత్రి పొంగులేటితో కలిసి హాజరవుతారు.

ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీపై నమ్మకంతో వచ్చే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న అధికారులను ఆదేశించారు. సంక్రాంతి ప్రత్యేక బస్సుల నిర్వహణపై ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వారి మన్ననలు పొందాలని తెలిపారు. హైదరాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వచ్చే వారి కోసం 66రిజర్వేషన్ సర్వీసులు, 220 మహాలక్ష్మి సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. కాగా, ప్రయాణికుల రద్దీ క్రమంలో బస్టాండ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సాయం తీసుకోవాలని డిపో మేనేజర్లకు సూచించారు. మహాలక్ష్మి పథకం నేపథ్యాన రద్దీ ఉండే అవకాశమున్నందున ప్రయాణికులు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. అన్ని అదనపు సర్వీసులు కూడా సాధారణ చార్జీలతో నడుస్తాయని ఆర్‌ఎం తెలిపారు. ఈసమావేశంలో డిప్యూటీ సీటీఎంలు పవిత్ర, భవానీప్రసాద్, అధికారులు శ్రీహరి, బి.శ్రీనివాస్, శ్రీనివాసరావు, రామిశెట్టి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

20న ‘నవోదయ’ ప్రవేశపరీక్ష

కూసుమంచి: కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 20న ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డులు(హాల్‌టికెట్లు) డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు సూచించారు.

కిష్టారం ఓసీ భేష్..

83 రోజుల ముందే ఉత్పత్తి లక్ష్యసాధన



మాట్లాడుతున్న కిష్టారం పీఓ నర్సింహారావు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారంలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లో 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 83 రోజుల ముందే పూర్తయింది. ఓసీకి 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని కేటాయించగా సోమవారం లక్ష్యాన్ని చేరుకున్నట్లు పీఓ ఎం.వీ.నర్సింహారావు వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం కార్మికులు, ఉద్యోగులను అభినందించి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజు సూచనలతో సింగరేణి వ్యాప్తంగా కిష్టారంలోనే ఒక్క ప్రమాదం జరగకుండా ఇంత త్వరగా లక్ష్యాన్ని చేరుకోగలిగామని తెలిపారు. భవిష్యత్‌లోనూ సీఎండీ, డైరెక్టర్లు, అధికారుల సూచనతో ముందు నిలిచేలా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ రమణారావు, కాలరీ మేనేజర్ రామకృష్ణ, సెక్రటరీ కిషోర్, రక్షణ అధికారి గోపీకిషోర్, ఐఎస్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ బాలాజీ, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంపై పట్టింపు లేదా..?

- పెద్దాస్పత్రి నుంచి ఒకేసారి 22 మంది వైద్యుల బదిలీ
- వీవీపీ ఆస్పత్రులకు కేటాయింపు
- ఫలితంగా వైద్యసేవలపై ప్రభావం
- డీఎంఈ పరిధి పోస్టులు భర్తీ చేయకుండానే బదిలీతో ఇక్కట్లు



సీటీ స్కాన్ గది వద్ద బారులు దీరిన పేషంట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. సుమారు 60 ఏళ్ల క్రితం 50 పడకలతో ప్రారంభమైన ఆస్పత్రి అంచెలంచెలుగా ఎదుగుతూ నాలుగు జిల్లాల ప్రజలకు వైద్య సేవలు అందించే స్థాయికి చేరింది. ప్రస్తుతం 575 పడకలతో కొనసాగుతున్న ఈ ఆస్పత్రిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని జిల్లాల ప్రజలు చికిత్స పొందుతున్నారు. ఈ ప్రాముఖ్యత దృష్ట్యా ఆస్పత్రిని అనుసంధానిస్తూ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయగా.. వంద సీట్లతో మొదటి సంవత్సరం బోధన మొదలైంది. ఫలితంగా ఆస్పత్రి వైద్యవిధాన పరిషత్(వీవీపీ) నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్లింది. అయితే, ఇక్కడ వైద్యుల పోస్టులు భర్తీ చేశాక వీవీపీ వైద్యులు, ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉండగా అధికారులు అదేమీ ఆలోచించకుండా ఒకేసారి 22మంది వైద్యులను బదిలీ చేశారు. ప్రత్యామ్నాయంపై దృష్టి సారించకపోగా మరో నెలలో పూర్తిస్థాయిలో డీఎంఈ వైద్యులు, ఉద్యోగులు వస్తారని చెబుతున్నా తొందరపడి వీవీపీకి వైద్యులను పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందనే చర్చ జరుగుతోంది.

గతంలోనే ఆప్షన్లు

మెడికల్ కళాశాల పరిధిలోకి జిల్లా ఆస్పత్రి వెళ్లడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత ఏడాది ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్య విధాన పరిషత్ వైద్యులు, ఉద్యోగులు రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిల్లో ఆప్షన్లు ఇచ్చుకున్నారు. సుమారు 200 మందికి పైగా ఉండగా వీరిలో 50 మందికిపైగా వైద్యులు ఉన్నారు. కానీ డీఎంఈ పరిధిలో పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండానే వైద్య విధాన పరిషత్ వైద్యులను పంపిస్తుండటంతో ఆస్పత్రికి వచ్చే వారికి వైద్య సేవలు అందించడంలో ఇబ్బంది ఎదురవుతోంది. పది రోజుల క్రితం ఒకేసారి 22 మంది సీనియర్ వైద్యులను వారి శాఖ పరిధిలోని ఆస్పత్రులకు బదిలీ చేశారు. అందులో 11 మంది సివిల్ సర్జన్లు, 11 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఉండగా... గైనకాలజీ, పీడియాట్రిక్ వైద్యులు వెళ్లిపోవడంతో మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సేవలపై ప్రభావం పడుతోంది. అలాగే, చాలా ఏళ్లుగా ఆర్ఎంఓగా పనిచేస్తున్న బి.శ్రీనివాసరావును సైతం బదిలీ చేయడంతో ఆస్పత్రి పర్యవేక్షణలో కొంత కాలం సమస్య ఎదురవుతుందని ఉద్యోగులే చెబుతున్నారు. ప్రస్తుతం నూతన సూపరింటెండెంట్, ఇతర ఆర్ఎంఓలు పర్యవేక్షించగలిగినప్పటికీ అనుభవం కలిగిన అధికారి లేకపోవడంతో ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది.

పూర్తిస్థాయిలో భర్తీ చేస్తేనే...

గత ఏడాది ఖమ్మం కేంద్రంగా మెడికల్ కళాశాల మంజూరు చేయగా ఈ విద్యాసంవత్సరం బోధన ప్రారంభించారు. అయితే డీఎంఈ పరిధిలో ఇప్పటివరకు మెడికల్ కాలేజీలో వైద్యులు, ఉద్యోగుల భర్తీ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. అయినా కళాశాలకు అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి వైద్యులు, ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బందిని పంపిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఖమ్మం మెడికల్ కాలేజీకి 433 పోస్టులు మంజూరుచేయగా... అందులో సుమారు 285 పోస్టులను జనరల్ ఆస్పత్రికి కేటాయించాలి. కానీ మొత్తంగా ఇప్పటి వరకు 67 పోస్టులే భర్తీ చేసి, త్వరలోనే మిగతా వారిని నియమిస్తామని చెబుతున్నారు. అప్పటివరకు ఆగకుండా వీవీపీ ఆస్పత్రులకు వైద్యులు, ఉద్యోగులను కేటాయించడంతో పెద్దాస్పత్రికి వచ్చే వారికి వైద్యసేవలు అందించడంలో జాప్యం జరుగుతోంది. కళాశాలకు 24 ప్రొఫెసర్ పోస్టులు కేటాయించగా ఏడుగురిని, 30 అసోసియేట్ ప్రొఫెసర్లకు ఐదుగురు, 58 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 34 మందినే కేటాయించారు. ఇక 203 నర్సింగ్ పోస్టులు సైతం భర్తీ చేయకపోగా ప్రిన్సిపాల్ కార్యాలయం, సూపరింటెండెంట్ కార్యాలయాల్లో కూడా ఉద్యోగులను నియమించకపోవడంతో పరిపాలనాపరంగా సమస్య ఎదురయ్యే అవకాశముంది.

ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నాం



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డీఎంఈ పరిధిలోకి రావడంతో వైద్యులు, ఉద్యోగులను బదిలీ చేస్తున్నారు. ఇది సహజంగా జరిగే ప్రక్రియ. త్వరలోనే డీఎంఈ పరిధిలోని ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బందిని నియమిస్తారు. అయినా వైద్య సేవలపై ప్రభావం పడకుండా పర్యవేక్షిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. త్వరలోనే వైద్యులు, సిబ్బంది వస్తే ఇబ్బంది ఉండదు.

– బి.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

లోక్‌సభ ఎన్నికల్లో గెలవాల్సిందే..



సమీక్షలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన హరీశ్‌రావు, ఎంపీలు నామా, పార్థసారథిరెడ్డి, వద్దిరాజు, మాజీ మంత్రి అజయ్ తదితరులు

- ప్రజల్లో అసంతృప్తికి కారణాలపై సమీక్షించుకుందాం
- ఖమ్మం పార్లమెంటరీ స్థాయి సమావేశంలో కేటీఆర్
- మరోసారి ఎంపీ అభ్యర్థిగా నామ పేరు ప్రతిపాదన

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోవడానికి, ప్రజల్లో ఉన్న అసంతృప్తికి కారణాలపై సమీక్షించి ముందుకు సాగాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం జరగగా కేటీఆర్ పాల్గొని అసెంబ్లీ ఫలితాలపై సమీక్షించాక జిల్లా నేతలకు సూచనలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని కచ్చితంగా గెలిపించుకునేలా నేతలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై నెల దాటగా, అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే వాగ్దానాలు అమలు చేస్తామన్న ఆ పార్టీ నేతలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ హామీలను ప్రభుత్వం అమలు చేసేలా పోరాడాలని సూచించారు.

జనం నాడి తెలుసుకోలేకపోయాం..

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఈ సమావేశంలో మాట్లాడారు. కొత్తగూడెంలో కచ్చితంగా గెలుస్తామని అనుకున్నా అందుకు విరుద్ధంగా ఫలితం వచ్చిందని తెలిపారు. ఒక్క ఎమ్మెల్యే ఓడిపోతే ఏమవుతుందిలే అనుకుని చెట్టు కొమ్మలను ఒక్కటొక్కటిగా నరుక్కోగా.. ఇప్పుడు చెట్టు కూలిపోయే పరిస్థితి తెచ్చుకున్నామని పేర్కొన్నారు. కాగా, రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో కొట్లాడే ఎంపీ నామ నాగేశ్వరరావుకు మరోమారు ఖమ్మం సీటు కేటాయించాలని కోరారు.

నామ పేరు ప్రతిపాదన

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం అభ్యర్థిగా మరోసారి నామ నాగేశ్వరరావును బరిలో నిలపాలని జిల్లా నేతలు బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతిపాదించనున్నారు. ఈ విషయాన్ని సమావేశం అనంతరం నాయకులు వెల్లడించారు. ఖమ్మం ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

25వరకు సీఎంఆర్ గడువు

- ఆలోగా బియ్యం ఇచ్చేయాల్సిందే..
- మరోసారి పొడిగించడం ఉండదు
- సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని ఈనెల 25వ తేదీలోపు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)గా మార్చి ఇవ్వాల్సిందేనని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన రైస్ మిల్లర్లు, అధికారులతో 2022–23 ఖరీఫ్ సీజన్ సీఎంఆర్‌పై సమీక్షించారు. మిల్లర్లు 1,82,790 మెట్రిక్ టన్నులకు గాను 1,71,754.900 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చారని, మిగతాది కూడా 25వతేదీ లోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని సూచించారు. మరోమారు గడువు పొడిగింపు ఉండదనే విషయాన్ని గుర్తించి రోజువారీ లక్ష్యసాధన రూపొందించుకోవాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలత, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ రంగప్రసాద్‌నాయక్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి

జిల్లాలో విద్యుత్ సదుపాయం లేని గృహాలకు కనెక్షన్లు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల్లో పలువురు విద్యుత్ మీటర్ నంబర్ వేయకపోవడంతో కారణాలు విశ్లేషించాలన్నారు. ఒకే ఇంటిపై రెండు కనెక్షన్లు ఉన్నాయా, అసలే కనెక్షన్ లేదా, ఉంటే ఏదైనా కారణంతో రద్దయిందా అనే వివరాలు సేకరించాలని సూచించారు. అలాగే, తాగునీటి పథకాలు, గిరివికాసం, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లకు ఇవ్వాల్సిన కనెక్షన్లపై సూచనలు చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ కె.రమేష్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, డీడబ్ల్యూఓ సుమ, అధికారులు పుష్పలత, బాబురావు, రామారావు, కృష్ణ, నాగేశ్వరరావు, రాములు, శ్రీధర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల నమోదుపై దృష్టి

త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 6వతేదీ వరకు ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశముండగా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత పత్రంపై గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించాలని, ఫొటో, అసెంబ్లీ నియోజకవర్గ ఎపిక్ కార్డ్ ప్రతి జత చేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాలలు, కోర్టులు, వైద్యులు ఇతర అన్ని వర్గాల వారితో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

పెనుబల్లి/తల్లాడ: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల విద్యాశాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.సత్యనారాయణరెడ్డి సూచించారు. పెనుబల్లి మండలం వీఎం.బంజర్, తల్లాడ జెడ్పీహెచ్‌ఎస్‌లను మంగళవారం స్టేట్ రిసోర్స్ పర్సన్ కె.ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు ఇంకా రెండు నెలలే ఉన్నందున సమయాన్ని విభజించుకుని అన్ని సబ్జెక్టులు చదవాలని తెలిపారు. అనారోగ్యం బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రత్యేక తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. అనంతరం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశమైన ఆర్‌జేడీ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ఉత్తీర్ణత నమోదుకు కృషి చేయాలని సూచించారు. పెనుబల్లి మండలం నోడల్ అధికారి కె.మోహన్‌రావు, తల్లాడ ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, హెచ్‌ఎంలు ఎస్.సత్యనారాయణ, పి.ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి : విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

పండుగకు ‘ప్రత్యేక’ం

- నేటి నుంచి స్పెషల్ బస్సులు
- ఈనెల 15 వరకు సంక్రాంతి సర్వీసులు
- రీజియన్ పరిధిలో 276 ప్రత్యేక బస్సులు
- పండుగ వేళ భారీగా పెరగనున్న రద్దీ



కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

చుంచుపల్లి/ఖమ్మం మామిళ్లగూడెం: తెలుగు ప్రజలు పెద్దపండుగగా జరుపుకునే సంక్రాంతి సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చే ప్రయాణికుల కోసం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. బుధవారం నుంచి ఈనెల 15 వరకు రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 276 బస్సులను హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, ఏలూరు, జంగారెడ్డిగూడెం, గుంటూరు, నెల్లూరు ప్రాంతాలకు నడవనున్నాయి. హైదరాబాద్ రూట్‌లో రద్దీ ఎక్కువగా ఉండనున్నందున ఆ మార్గానికే ఎక్కువ సర్వీసులు కేటాయించారు. ప్రధానంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ వైపునకు ఎక్కువ సర్వీసులను అందుబాటులో ఉంచారు. ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు మరికొన్ని బస్సులు నడిపించేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ప్రత్యేక సర్వీసులైనప్పటికీ ఎలాంటి అదనపు చార్జీలను ఉండవని ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

అన్ని రూట్లు కవర్ చేసేలా..

సంక్రాంతి పండుగ సందర్భంగా రీజియన్ పరిధిలో ఏర్పాటు చేసిన 276 బస్సుల్లో ఖమ్మం డిపో నుండి 66బస్సులు, మధిర నుండి 38, సత్తుపల్లి నుండి 55, కొత్తగూడెం నుంచి 33 బస్సులు, భద్రాచలం నుంచి 45, మణుగూరు నుంచి 23, ఇల్లెందు నుంచి 16 సర్వీసులు కేటాయించారు. ఈనెల 10 నుంచి 15 వరకు డిపోల వారీగా కేటాయించిన వివిధ రూట్లకు బస్సులు తిప్పేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ప్రతీ పండుగల సీజన్ మాదిరిగానే ఈ సంక్రాంతికి కూడా మరింతగా ఆదాయాన్ని సమకూర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ రద్దీ ద్వారా డిపోల పరిధిలో దాదాపు రూ.45 నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం రానుందని అధికారుల అంచనా.

‘మహాలక్ష్మి’తో తాకిడి

రాష్ట్రప్రభుత్వం ఇటీవల మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తూ మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం లేదు. కానీ ఈసారి ఉండడంతో సంక్రాంతికి మహిళలు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించే అవకాశముంది. ఈ నేపథ్యాన డిపోలు, బస్టాండ్లు, ముఖ్యకూడళ్లలో సమాచారం ఇచ్చేందుకు ఆర్టీసీ ఉద్యోగులను కేటాయించారు. అలాగే, అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు కోసం ఇప్పటికే పోలీసు శాఖకు అధికారులు లేఖ రాశారు.

మరింత పతనం దిశగా..

- మరో రూ.500 పడిపోయిన మిర్చి ధర
- నెల వ్యవధిలో రూ.3,500 తగ్గిన వైనం
- విక్రయాలు పెరుగుతుండడంతో ధరకు గండి



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర పతనం దిశగా సాగుతోంది. పంట విక్రయాలు పెరిగే కొద్దీ ధర తగ్గుతుండడంతో రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. నెల రోజులుగా మిర్చి ధర దాదాపు రూ.3,500 మేర తగ్గింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం తేజా రకం మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.21వేల ధర పలకగా.. మంగళవారం రూ.500 తగ్గి రూ.20,500గా నమోదైంది. ఈనెల ఆరంభం నుంచి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. గత నెలలో రూ.24,500 పలికిన మిర్చి ధర ఈ నెల ఆరంభంలో రూ.23,600కు చేరగా, 3వ తేదీన రూ.23వేలు, 8వ తేదీన రూ.21 వేలుగా నమోదైంది. గత ఏడాది గరిష్టంగా రూ.25వేల వరకు పలికి ధర ఈసారి నెల రోజుల వ్యవధిలో రూ.3,500 మేర తగ్గడం గమనార్హం. మంగళవారం జెండాపాట ధర రూ.20,500 కాగా మోడల్ ధర రూ.17,500గా, కనిష్ట ధర రూ.7 వేలుగా పలికింది. మార్కెట్‌లో ఒకటి, రెండు లాట్లకే గరిష్ట ధర చెల్లించిన వ్యాపారులు మిగిలిన సరుకుకు మోడల్ ధర, అంతకన్నా కాస్త ఎక్కువ చెల్లించారు.

వ్యాపారుల మాయాజాలం

కొత్త పంట సీజన్ ప్రారంభమై విక్రయాలు పెరుగుతుండడంతో వ్యాపారులు ధరలో కోత పెడుతున్నారు. తేజా మిర్చికి విదేశాల్లోమంచి డిమాండ్ ఉండడంతో ఇక్కడ కొనుగోలు చేసే వ్యాపారులు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం మిర్చి తొలి కోతలు జరుగుతుండగా.. అంత నాణ్యతగా ఉండడం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు పంట నాణ్యతగా లేదని, తేమ ఎక్కువగా ఉందంటూ తక్కువ ధరతో దక్కించుకుంటున్నారు. అయితే, వ్యాపారులు మాత్రం విదేశాల నుంచి ఆర్డర్లు లేకపోవడమే ధర తగ్గడానికి కారణమని చెబుతుండడం గమనార్హం.

తాలు మిర్చిదీ అదే బాట

తాలు మిర్చి ధర కూడా పతనమవుతోంది. గత నెలలో రూ.15 వేల వరకు పలికిన క్వింటా తాలు మిర్చి ధర ప్రస్తుతం రూ.10 వేలకు పడిపోయింది. మంగళవారం తాలు మిర్చి మోడల్ ధర రూ.8,500గా, కనిష్ట ధర రూ.6 వేలుగా పలికింది. రైతులు ఎర్రమిర్చి తీసుకొస్తున్నా తాలు మిర్చిని పోలి ఉందంటూ ధర తగ్గిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ముందుకు వచ్చిన సీజన్

ఈ ఏడాది మిర్చి పంట సీజన్ ముందుకొచ్చింది. ఏటా ఆగస్టు 15 తర్వాత సాగు ప్రారంభిస్తారు. రెండేళ్లుగా మిర్చికి తామర పురుగు ఆశిస్తుండటంతో రైతులు ఈ ఏడాది జూలై ఆరంభం నుంచే సాగు చేశారు. అయినా పంట దిగుబడి, తెగుళ్ల బెడదలో ఎలాంటి తేడా లేదని చెబుతున్నారు. కాగా, ఫిబ్రవరి ఆరంభం నుంచి పంట విక్రయాలు పెరగాల్సి ఉండగా ఎన్నడూ లేనట్లు ఈసారి జనవరి ఆరంభం నుంచే ఊపందుకున్నాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో కూడా ఇదే సమయానికి పంట కొనుగోళ్లు మొదలుకావడం కూడా ధర తగ్గడానికి ఓ కారణమనే చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

హైవే సర్వేను అడ్డుకున్న రైతులు



నిరసన తెలుపుతున్న రైతులు

ఖమ్మంరూరల్: నాగ్‌పూర్ – అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా భూసేకరణకు వచ్చిన అధికారులను మండలంలోని తీర్థాలకు చెందిన రైతులు మంగళవారం అడ్డుకున్నారు. ఈమేరకు అఖిలపక్షం నాయకులు, రైతులు మాట్లాడారు. తరతరాలుగా తాము భూముల్లో పంటలు పండించుకుంటున్నామని, ఇప్పుడు రహదారి కోసం భూములను బలవంతంగా లాక్కోవడం సరికాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రహదారి నిర్మాణానికి భూములు ఇవ్వబోమని, అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. ఈకార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు, రైతులు కరుణాకర్, బి.రాంబాబు, కె.వెంకటరెడ్డి, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీ తొలగింపు

ఖమ్మం లీగల్: ఖమ్మం మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్త వెంకటేశ్వరరావును తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కు అనుకూలంగా వెంకటేశ్వరరావు వ్యవహరించారని కోయిన్ని వెంకన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అనంతరం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయనను ఏపీపీ పదవి నుంచి తొలగించారు. కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జి.హరీందర్ రెడ్డిని నియమించారు.

భార్య హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెంలో ఇటీవల మహిళను గొడ్డలితో నరికి హత్య చేసిన కేసులో ఆమె భర్తను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేసే మూడ్ వీరన్న మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకోగా ప్రశ్నించిన భార్య ఆదిలక్ష్మిని గత శనివారం గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఈమేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని నాగులవంచకు చెందిన ఎలిశాల తిరపయ్య(55) ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గత నెల 24వ తేదీన తిరుపయ్య తన పొలంలో పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా, కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్ మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల వద్ద చెట్టుకు ఢీకొట్టిన లారీ బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఏలూరు నుండి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళ్తున్న లారీ మంగళవారం ఉదయం ఆరెంపుల వద్దకు రాగానే అదుపు తప్పింది. ఈ మేరకు చెట్టుకు ఢీకొట్టి రోడ్డు పక్కనే బోల్తా పడగా తీవ్రగాయాలతో డ్రైవర్ బాలాజీ(35) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, క్లీనర్ నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా పోలీసులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ధంసలాపురం వద్ద కేబుల్ టీవీ లైన్ మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందాడు. మహబూబాద్ జిల్లా బయ్యారానికి చెందిన అనిల్‌కుమార్(28) కేబుల్ టీవీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం లైన్ మరమ్మతు చేసే క్రమంలో విద్యుత్ స్తంభంపై వైర్‌ను సరిచేస్తుండగా షాక్ తగలడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అనిల్ సోమవారం అర్ధరాత్రి మృతి చెందగా, ఆయన బంధువుల ఫిర్యాదుతో మంగళవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని శ్రీనగర్‌కాలనీలో మంగళవారం మధ్యాహ్నం చిరునామా అడుగుతున్నట్లు నటించిన వ్యక్తులు మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లారు. కాలనీకి చెందిన తుల్లూరి లక్ష్మయ్య – సరస్వతి దంపతులు తాము అద్దెకు ఉంటున్న ఇంటి వరండాలో కూర్చున్నారు. ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు రామారావు ఇంటి అడ్రస్ ఎక్కడ అని ఆరా తీస్తూనే సరస్వతి మెడలోని గొలుసు తెంచుకుని పరారయ్యారు. ఘటనపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

విద్యుత్ కేంద్రం విస్తరించేనా?

- కేటీపీఎస్ 8వ దశకు భౌగోళిక వనరులు అనుకూలం
- ఓఅండ్‌ఎం స్థానంలో మరొకటి నిర్మించాలనే డిమాండ్
- పాతప్లాంట్ నుంచి ఎప్పటికప్పుడు విడిభాగాల తరలింపు
- ఖాళీ అవుతున్న వందలాది ఎకరాల స్థలం



కూల్చివేస్తున్న కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారం

పాల్వంచ : రాష్ట్రానికి వెలుగులు పంచుతూ తలమానికంగా నిలుస్తున్న పాల్వంచ కేటీపీఎస్‌లో మరో కర్మాగారం నిర్మాణానికి అడుగులు పడాలనే ఆకాంక్ష ముందుకొస్తోంది. ఇప్పటికే ఇక్కడ అత్యధికంగా 1,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరో యూనిట్ స్థాపనకు భౌగోళిక వనరులు అందుబాటులో ఉన్నాయి. ఐదేళ్ల క్రితం మూతబడిన ఓఅండ్‌ఎం పాతప్లాంట్‌కు సంబంధించిన స్థలం, బొగ్గు, నీరు పుష్కలంగా ఉన్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కాలుష్య నివారణ నియంత్రణ ప్లాంట్ (ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్-ఎఫ్‌జీడీ) కూడా పాల్వంచలో నిర్మిస్తున్నారు. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉండడంతో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. పాతప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో వందలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్వంచ విడిచి వెళ్లడంతో పట్టణాభివృద్ధిపైనా తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడు ఎనిమిదో దశ ప్లాంట్ నిర్మిస్తే తిరిగి పట్టణం కళకళలాడే అవకాశం రానుంది.

పాత ప్లాంట్ తొలగింపుతో భారీగా స్థలం

కాలం చెల్లిన కేటీపీఎస్ ఓఅండ్‌ఎం(పాత ప్లాంట్)ను 2018లో మూసేశారు. దాని స్థానంలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం గల సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో 7వ దశ నిర్మాణం చేశారు. ఇక మూసివేసిన పాత ప్లాంట్‌లోని నిర్మాణాలన్నింటినీ తొలగిస్తున్నారు. హెచ్‌ఆర్ కమర్షియల్ సంస్థ కర్మాగారంలోని విడి భాగాలను తుక్కుగా మార్చి తరలిస్తోంది. ఈ క్రమంలో అక్కడ వందలాది ఎకరాల స్థలం సమకూరుతుంది. కేటీపీఎస్ ఏ, బీ కాలనీలు, ఇంటర్మీడియట్ కాలనీల్లో చాలా వరకు క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ క్వార్టర్లను తొలగించి అపార్ట్‌మెంట్ల తరహాలో క్వార్టర్లు నిర్మించాలని యాజమాన్యం యోచించింది. ఇది కార్యరూపం దాలిస్తే ఆయా కాలనీల్లో సైతం చాలా స్థలం మిగిలే అవకాశం ఉంది. కేటీపీఎస్ విస్తరణ జరిగితే ఈ స్థలాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. తద్వారా సౌకర్యాలు మరింతగా మెరుగుపడతాయి.

కాగా, కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి కేటీపీఎస్ కాల్వ ద్వారా పుష్కలమైన నీరు, కొత్తగూడెం, మణుగూరు సింగరేణి రైల్వే లైన్‌ల ద్వారా బొగ్గు సరఫరా అవుతున్నాయి. సిబ్బందికి అవసరమైన క్వార్టర్ల నిర్మాణాలు, మౌలిక వసతులు అనుకూలంగా ఉన్నాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో చేపట్టే కర్మాగారాలకు స్థలం, సిబ్బంది, ఇతర నిర్మాణ ఖర్చుల భారం కూడా తక్కువగా ఉంటుంది. ఇక ఓఅండ్‌ఎం మూసివేయడంతో సుమారు 1800 మంది ఉద్యోగులు ఇతర కర్మాగారాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. కేటీపీఎస్‌లో నూతన కర్మాగారం నిర్మించి ఆ ఉద్యోగులను సైతం తిరిగి ఇక్కడికి తీసుకురావాలని ఉద్యోగ సంఘాలు సైతం కోరుతున్నాయి. ప్రస్తుతం కేటీపీఎస్ 5, 6 దశల్లో 1000 మెగావాట్లు, 7వ దశలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. వచ్చే పదేళ్ల తర్వాత ఈ రెండు కర్మాగారాలు కూడా మూతపడతాయి. ఈ క్రమంలో 8వ దశ అనివార్యమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

సౌకర్యాలు లేని చోట కర్మాగారాలు..

నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, మణుగూరులో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లకు భౌగోళిక వనరులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వైటీపీఎస్‌కు ఇప్పటికీ బొగ్గు లారీల ద్వారానే సరఫరా అవుతుంది. ఇక బీటీపీఎస్‌కు రైల్వే లైన్ వేయనేలేదు. అయితే థర్మల్ ప్లాంట్ నిర్మాణాలకు అవసరమైన బొగ్గు, నీరు, భూమి, రైల్వే లైన్, సిబ్బంది నివాస గృహాలు, రక్షణ లాంటి సౌకర్యాలు ఉన్న కేటీపీఎస్‌లో మరో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో కొత్త కర్మాగారం నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

డేటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టండి

ప్రత్యేకాధికారుల సమీక్షలో కలెక్టర్



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పకడ్బందీగా చేయించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాల నమోదు పూర్తయిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు 100 శాతం, టీమ్ లీడర్లు ఐదు శాతం, మండల ప్రత్యేక అధికారులు ఒక శాతం తనిఖీ చేయాలని తెలిపారు. ఎక్కువ పొరపాట్లు చేసే ఆపరేటర్లను మార్చాలని చెప్పారు. కాగా, ఖమ్మంరూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీని కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవోలు జి.గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

కొణిజర్ల: ప్రజాపాలన సభల్లో ప్రజలు అందజేసిన దరఖాస్తుల్లోని ప్రతీ వివరాన్ని తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జరుగుతుండగా మంగళవారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు నమోదు చేశారు, ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఆపరేటర్లను ఆరా తీశారు. మండల ప్రత్యేకాధికారి టి.సుమ, ఎంపీడీఓ కె.మహాలక్ష్మి, తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్, ఎంపీఓ పి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు

ఖమ్మం స్పోర్ట్స్: ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పాఠశాలల అండర్-14 బాలుర నెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఈ జట్టులో ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఉండగా రజత పతకం దక్కించుకున్నారు. పతకాలు పొందిన వారిలో బి.వినయ్, సీహెచ్.సిద్ధు, ఈ.జగన్ ఉన్నారు. ఢిల్లీ జట్టుతో జరిగిన ఫైనల్స్‌లో చివరి వరకు పోరాడిన తెలంగాణ జట్టు ఓటమి పాలైంది. ఈసందర్భంగా క్రీడాకారులను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.నర్సింహమూర్తి, నెట్‌బాల్ కోచ్ పీ.వీ.రమణ, నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఫణికుమార్ తదితరులు అభినందించారు.



పతకాలు దక్కించుకున్న జిల్లా క్రీడాకారులు

సహకార సంఘాల నిర్వహణపై శిక్షణ

ఖమ్మంవ్యవసాయం: పీఏసీఎస్‌ల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఖమ్మంలోని కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో పాలకవర్గాలకు మంగళవారం శిక్షణ నిర్వహించారు. బ్యాంకు సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ కన్వీనర్‌గా వ్యవహరించగా, రాష్ట్ర సహకార శిక్షణా సంస్థ ప్రతినిధులు విజయశంకర్, సుబ్బారావు పలు అంశాలపై డీసీసీబీ డైరెక్టర్లు, సహకార సంఘాల పాలకవర్గాలకు శిక్షణ ఇచ్చారు. జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడగా, పీఏసీఎస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ప్రోగ్రాం కోఆర్డినేటర్లను సత్కరిస్తున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన జూనియర్స్ విభాగంలో జిల్లా బాలబాలికల జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఈ జట్లు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. బాలుర జట్టుకు యశ్వంత్‌కుమార్, బి.రాజేష్, ఆర్.అనిల్‌కుమార్, బి.కౌశిక్, బి.సందీప్, డి.రాజు, బి.అశోక్ హినోస్, నాగరాజు, సాయిరాం, అజయ్ ఎంపిక కాగా, బాలికల జట్టుకు బి.ప్రియాంక, ఎం.సంధ్య, బి.నాగమణి, పి.స్పందన, ఎం.ఉమారాణి, బి.కుసుమ, యు.సంధ్య, దివ్య, సౌమ్య, నిర్మల, ఆర్.దీపిక, కె.సుప్రియ, కె.అంజలీ, కె.వసంతకుమారి, ఎ.మనీషా, ఎ.సరి ఎంపికయ్యారు. వీరికి కల్లూరులోని ఇండోర్ స్టేడియంలో శిక్షణ శిబిరం ఏర్పాటుచేయనున్నారు.

వాలీబాల్ పోటీల్లో ఖమ్మం జట్టు ప్రతిభ

ఖమ్మంవ్యవసాయం: మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల పోటీల్లో ఖమ్మం జట్లు ప్రతిభ కనబరుస్తున్నాయి. ఇంటర్ సర్కిల్ వాలీబాల్, కార్యమ్స్ పోటీలు నిర్వహిస్తుండగా వాలీబాల్‌లో మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జట్లపై ఖమ్మం జట్టు విజయం సాధించింది. జట్టుకు కోచ్‌గా ప్రకాష్, మేనేజర్‌గా బి.ఉపేందర్ వ్యవహరిస్తున్నారు.



ఖమ్మం విద్యుత్ ఉద్యోగుల వాలీబాల్ జట్టు

జోరుగా..హుషారుగా..

- ఇగ్నైట్ ఫెస్ట్‌లో అలరించిన విజ్ఞాన, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



ఇగ్నైట్ ఫెస్ట్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల విద్యాసంస్థలో నిర్వహిస్తున్న ఎతోస్ ఇగ్నైట్ ఫెస్ట్ కార్యక్రమంలో విద్యార్థుల విజ్ఞాన, సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇగ్నైట్ ఫెస్ట్ రెండో రోజు మంగళవారం ఉత్సాహంగా సాగింది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 1,500 మంది బాల, బాలికలు హాజరయ్యారు. యూత్ పార్లమెంట్, యూఎస్‌ఓ, స్టోరీ టెల్లింగ్, సైన్స్ ఫేర్, పాటలు, గ్రూప్ డాన్స్ తదితర 28 అంశాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రీజినల్ స్థాయిలో నిర్వహించిన ఇగ్నైట్ ఫెస్ట్‌లో గెలుపొందిన బాల, బాలికలు ఈ స్టేట్ మీట్‌లో పాల్గొంటుండడంతో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా గిరిజన గురుకులాల ఏసీఏడీ డిప్యూటీ సెక్రటరీ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇగ్నైట్ ఫెస్ట్ అనేది విద్యార్థులు తమ జీవితాల్లో మరిచిపోలేని వేడుకని, ఇలాంటి పోటీల్లో పాల్గొనడంతో బాలబాలికల్లో మరింత సృజనాత్మక శక్తి పెరుగుతుందని చెప్పారు. సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గిరిజన గురుకుల ఓఎస్డీ ఎస్.శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. ఫెస్ట్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరూ విజయం కోసం కృషి చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాల, బాలికలతో పాటు సిబ్బందికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల సీఈ ఎస్.సుమలత, తుమికి వెంకటేశ్వర రాజు, పలు జిల్లాల ఆర్‌సీఓడీఎస్‌లు వెంకన్న, నాగార్జున, అగస్టీన్, లక్ష్మయ్య, గంగాధర్, సంపత్ కుమార్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లపై శబరిమల యాత్ర

ఇల్లెందు/కారేపల్లి: ఇల్లెందుకు చెందిన ముగ్గురు అయ్యప్ప మాలధారులు సైకిళ్లపై శబరిమలై యాత్ర చేపట్టారు. పట్టణంలోని జేకేకాలనీ శ్రీహరిహర క్షేత్రంలో మంగళవారం ఇరుముడి కట్టుకున్న సామల రవితేజ, బి.ఉదయ్, కె.నగేశ్, వంశీ యాత్రగా బయలుదేరారు. ఈ యాత్ర 1,250 కిలోమీటర్ల మేర సాగనుండగా, కారేపల్లి బస్టాండ్ వద్ద వారికి స్థానిక భక్తులు స్వాగతం పలికారు. సుమారు 12 రోజుల ప్రయాణం అనంతరం శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకోనున్నట్లు వారు తెలిపారు.



ఇల్లెందు నుంచి బయలుదేరుతున్న మాలధారులు

నేడు విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు బుధవారం సన్మానించనున్నారు. పాఠశాలల్లో స్కూల్ డే నిర్వహించడమే సహజమే అయినా తల్లిదండ్రులను సన్మానించాలనే నూతన సంప్రదాయాన్ని ప్రారంభిస్తున్నామని హెచ్‌ఎం శివకుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు హాజరు కావాలని ఆమె కోరారు.

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ఖమ్మంవ్యవసాయం: సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు మంగళవారం వరంగల్‌లోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐఆర్ఆర్‌బీఈఏ, ఎన్‌ఎఫ్‌ఆర్ఆర్‌బీఈఏ పిలుపు మేరకు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో ఉన్న ఏపీజీవీబీ శాఖల ఉద్యోగులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. దేశంలోని 43 గ్రామీణ బ్యాంకులను కలిపి నేషనల్ రూరల్ బ్యాంకు ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేసి అర్హులకు పదోన్నతులు కల్పించడమే కాక తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు క్రాంతికుమార్ మక్కడ్, అప్పలనాయుడు, ప్రతినిధులు గోపరాజు, కట్ల కోటయ్య, చంద్రశేఖర్, మనోజ్‌కుమార్, బాలకృష్ణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పంట ఉత్పత్తులు సహా రూ.లక్షల్లో ఆస్తినష్టం



మంటల్లో కాలిపోతున్న ఇల్లు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మకు రైతు బొల్లం సైదులు ఇంట్లో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో పత్తి, ధాన్యం, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. వివరాలు... రైతు సైదులు తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని పత్తి, వరి సాగుచేశాడు. ఈమేరకు సుమారు 100 క్వింటాళ్ల పత్తితో పాటు 65 బస్తాల ధాన్యం నిల్వచేయగా, సైదులు కుటుంబసభ్యులు మంగళవారం వ్యవసాయ పనుల కోసం పొలం వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు, మంటలు వస్తుండగా స్థానికులు గమనించి సైదులుకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఇంతలోనే మంటలు ఉవ్వెత్తున వ్యాపించి ఇంట్లో నిల్వ చేసిన పత్తి, ధాన్యంతో పాటు ఇతర దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అయితే, కొందరు యువకులు ధైర్యం చేసి ఇంట్లోని గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకరావటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కాగా, ఘటనలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సైదులు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తుండగా రూ.20లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఆర్‌ఐ రాము ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

11 నుంచి గాంధీపురం రైల్వేగేట్ మూసివేత

కారేపల్లి: ఇల్లెందు – ఖమ్మం ప్రధాన రహదారిపై ఉన్న కారేపల్లి మండలం గాంధీపురం రైల్వే గేట్‌ను ఈ నెల 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేట్ వద్ద ట్రాక్, రోడ్డు మరమ్మతుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు వాహనాలను కారేపల్లి క్రాస్ రోడ్డు నుంచి కారేపల్లి మీదుగా ఇల్లెందు వైపు, ఇల్లెందు నుంచి కారేపల్లి మీదుగా ఖమ్మం వైపు దారి మళ్లించనున్నామని తెలిపారు.


పాత ఫార్ములా ప్రకారమే ధర చెల్లింపు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ టన్ను ధరకు సంబంధించిన కొత్త ఫార్ములా జీఓ జారీ కాకపోవడంతో ధర చెల్లింపులకు పాత ఫార్ములానే అమలు చేయనున్నారు. గెలల ధర చెల్లింపుల కోసం ఏటా నవంబర్ నుంచి అక్టోబర్ వరకు ఆయిల్ ఇయర్‌గా పరిగణిస్తారు. ఆతర్వాత కొత్త ఫార్ములా ప్రకటించి, దాని ప్రకారమే ధర చెల్లిస్తారు. కాగా గతేడాది అక్టోబర్ 31తర్వాత ప్రకటించాల్సిన కొత్త ఫార్ములా పెండింగ్‌లో ఉండగా, ఈనెల 4న 19.02గా నిర్ణయించారు. అయితే కొత్త ఫార్ములాపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించగా, జీఓ జారీ కాలేదు. దీంతో గతేడాది నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన టన్ను ధరను పాత ఫార్ములా 19.32 ప్రకారమే రైతులకు చెల్లించేలా మంగళవారం అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త ఫార్ములా జీఓ జారీ కాకపోవడంతో టన్ను ధర చెల్లింపులకు పాత ఫార్ములానే అమలు చేస్తామని చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కల్లూరు: మండలంలోని పెద్దకోరుకొండికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యంపై మంగళవారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కంచెపోగు వెంకటేశ్వర్లు పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఉద్యోగం చేస్తూ వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. ప్రస్తుతం పెద్దకోరుకొండిలోనే ఉంటున్న ఆయనకు మతిస్థిమితం తప్పడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ గాలించినా ఆచూకీ లేకపోవడంతో వెంకటేశ్వర్లు భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అవిశ్రాంత యోధునికి
అశ్రునివాళి



కీ॥శే॥ మేదరమెట్ల వెంకటయ్య గారు
మరణం : 31-12-2023

శ్రీ మేదరమెట్ల వెంకటయ్య గారి

భార్య : మేదరమెట్ల జానకమ్మ
మనుమలు : వరుణ్, రిత్విక్
మరియు కుటుంబ సభ్యులు

కుమారులు–కోడళ్ళు
మేదరమెట్ల శ్రీనివాసరావు–చంద్రావతి
మేదరమెట్ల కాంతారావు–సునీత

మేదరమెట్ల బ్రదర్స్

పెద్దకర్మ : ది. 10-01-2024 బుధవారం రోజున ... ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా నందు జరుగును. ... సెల్: 7843787677, 8333308383

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate
■ ఖమ్మం మరియు హైదరాబాద్‌లో ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్, విల్లాస్, కమర్షియల్ షాపులు అమ్మి పెట్టబడును, కొని పెట్టబడును. సంప్ర॥ కాట్రపల్లి నాగరాజ్, ఖమ్మం. 9399342239. [M-1167587]

HOUSE FOR SALE
■ కల్లూరు NSP క్రాస్ రోడ్ తిరుపతమ్మ గుడి బజారులో 5 సెంట్లలో ఉన్న 4 గదుల రేకుల ఇల్లు అమ్మకమునకు కలదు ✆ 89850 08459 [B-1336]

Services
GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824526]

ASTROLOGY
■ దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: ఎస్.వి. రాఘవేంద్ర జోషి పునర్వివాహం, దాంపత్య సమస్యలు, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, వశీకరణం, ప్రతి సమస్యకు అంజనం, హోమాలతో 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపగలరు. ✆ 6364 999 444 [B-1255221]

Wanted
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073 [H-793674]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167593]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ.జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్ ✆ 6301053690, 8247500683 [B-1255440]

■ బాలాజీ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ.జీ: 15-21 వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్ ✆ 9542047788, 6301053500 [B-1255439]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

బల్క్ ఫిర్యాదులు చంద్రబాబు కుట్రే

సీఈసీకి విజయసాయిరెడ్డి ఫిర్యాదు



సాక్షి, అమరావతి: విపక్ష నేత చంద్రబాబునాయుడి జీవితమంతా మోసం, కుట్ర, కుతంత్రాలతో నిండిపోయిందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. లక్షల ఓట్లను తొలగించాలంటూ కోనేరు సురేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు బల్క్ ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. కోనేరు సురేష్ ఇచ్చిన అబద్ధపు బల్క్ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేశామన్నారు. టీడీపీ ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్‌సీపీ ఓట్లను టార్గెట్ చేసిందన్నారు. మరోవైపు దొంగ ఓట్ల చేర్పునకూ టీడీపీ పాల్పడుతోందన్నారు. 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్' పేరుతో చంద్రబాబు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమంగా అర్హుల ఓట్లు తొలగించేందుకు, దొంగ ఓట్ల చేర్పుకు చంద్రబాబు భారీ కుట్ర చేశారని చెప్పారు. ఓటరు కులం, రాజకీయ ప్రాధాన్యత అడిగే హక్కు బాబుకెవరిచ్చారు? అని నిలదీశారు. 'వన్ సిటిజన్.. వన్ ఓట్' అనేది తమ పార్టీ సిద్ధాంతం అని తెలిపారు. ఓటర్ ప్రొఫైల్ సర్వే పేరిట అభ్యంతరకర ప్రశ్నలపై సీఈసీకి ఫిర్యాదు చేశాం అని చెప్పారు. 6అంశాలపై సీఈసీని కలిశామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సభ్యులను కలిసిన అనంతరం మంగళవారం విజయవాడలో ఆయన ఎంపీ మార్గాని భరత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

'కోర్టు ద్వారా లోకేశ్‌కు నోటీసులు ఇవ్వండి'

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై నమోదైన కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను బెదిరించేలా వ్యాఖ్యలు చేసిన కేసులో నారా లోకేశ్‌కు నోటీసులు అందించాలని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం మంగళవారం కోర్టు అధికారులను ఆదేశించింది. నోటీసులు తీసుకునేందుకు నిరాకరించిన లోకేశ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెడ్ డైరీ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్ విచారణ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది.


బ్రో.. ఇది దొంగ ఓటు!

జనసేన కార్యాలయం చిరునామాతో పవన్ కల్యాణ్ ఓటు నమోదు


గత ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు పరిధిలో ఓటు

- ఆరు నెలల క్రితం చిరునామా మార్పు
- ఓటు నమోదులో పార్టీ కార్యాలయం చిరునామా చెల్లుబాటుపై అనేక రకాల అనుమానాలు

సాక్షి, అమరావతి: ఓటు దొంగలే.. దొంగా దొంగా అని అరుస్తున్నారు. మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు 'రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదవుతున్నాయి' అని స్వయంగా ఫిర్యాదు చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్.. రాష్ట్రంలో నమోదు చేసుకున్న ఓటుపై 'అదీ దొంగ ఓటే' అన్న చర్చ ఉంది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్నే తన నివాసంగా పేర్కొంటూ ఆయన ఓటు పొందారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆయన ఓటు ఏజీజడ్ 3083045 గుర్తింపు కార్డు నంబరుతో గుంటూరు జిల్లా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 197వ నంబరు పోలింగ్ బూత్ పరిధిలో ఉంది. ఓటర్ లిస్టులో ఆ ఓటు ఇంటి నంబరు 11-1903గా పేర్కొన్నారు. అయితే మంగళగిరి పట్టణ పరిధిలో ఆ ఇంటి అడ్రసు గురించి ఆరా తీస్తే అది జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం అడ్రసేనని స్పష్టమైంది. కొత్తగా ఒక ఇంటి చిరునామాతో ఓటు నమోదు చేసుకోవడానికి కొన్ని నియమ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని, ఈ లెక్కన ఒక పార్టీ కార్యాలయం అడ్రసుతో ఓటు నమోదు దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల అవగాహన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించి, జారీ చేసిన వివిధ రకాల నిబంధనావళిలో ఒకటైన.. 'మ్యానువల్ ఆన్ ఎలక్ట్రోల్ రోల్స్' ప్రకారం కొత్తగా వేరొక అడ్రసుతో ఓటరు నమోదుకు ఇంటి అడ్రసును 'ఆర్డనరీ రెసిడెన్స్' పేరుతో ప్రత్యేకంగా విశదీకరించారు. ఈ అంశంపై గౌహతి హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ప్రకారం ఇంటి అడ్రసు అంటే.. శాశ్వతంగా నివాసం ఉండేది అని కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల పుస్తకంలో స్పష్టంగా పేర్కొంది. టెంపరరీ (తాత్కాలిక) లేదా క్యాజువల్ నివాసంగా అది ఉండకూడదని ఆ నిబంధనలో స్పష్టంగా ఉంది. 'రెగ్యులర్‌గా రాత్రివేళ నిద్రించే ప్రాంతాన్నే' ఆ వ్యక్తి ఆర్డనరీ రెసిడెన్స్‌గా గుర్తించాలని స్పష్టం చేసింది. కానీ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రైవేట్ హోటల్‌లో బస చేస్తుంటారు. పార్టీ విధుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. అలాంటప్పుడు పార్టీ కార్యాలయం ఆయన శాశ్వత నివాసం ఎలా అవుతుందన్న విమర్శలున్నాయి. ఈ లెక్కన మంగళగిరి పార్టీ కార్యాలయం అడ్రసుతో ఆయన ఆరు నెలల ముందు నమోదు చేసుకున్న ఓటు.. దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారుల స్థాయిలో చర్చ సాగుతోంది.



దోర్ నంబర్ 11-1903ను అడ్రస్‌గా చూపించి జనసేన నేత పవన్‌కళ్యాణ్ నమోదు చేసుకున్న ఓటు



దోర్ నంబర్ 11-1903 మీద ఉన్న మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం చిరునామా

లక్ష పుస్తకాలు చదివానన్న స్వయం ప్రకటిత మేధావి ఆయన.. విలువల గురించి, అనుబంధాల గురించి ఊగిపోతూ ప్రసంగించడం ఆయనకు అలవాటు.. అందరూ తనలాగే ఆలోచించాలని, తన మార్గంలోనే నడవాలని ప్రవచన పలుకులు పలకడం కూడా ఆయనకే సొంతం. 'చంద్రబాబు చేత.. చంద్రబాబు కొరకు.. చంద్రబాబు యొక్క..' అంటూ అందరూ ఆ బాబు బాగు కోసమే పరితపించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన నేత. ఎన్నెన్నో నీతులు చెప్పే ఈ నేత నిబంధనలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయం చిరునామాతో ఓటు పొందడం ఇప్పుడు చర్చనీయాంశం. దయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదేమరి.

ఆ చిరునామాలో పవన్ ఓటు మాత్రమే..

2019 ఎన్నికల్లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన పవన్ కల్యాణ్.. తన ఎన్నికల అఫడవిట్‌లో తన కుటుంబ సభ్యుల వివరాలలో భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం అడ్రసు 11-1903తో ఇప్పుడు పవన్ తన ఒక్కరి ఓటు మాత్రమే నమోదు చేసుకోవడం విశేషం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2019 ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 91వ పోలింగ్ బూత్‌లో పవన్ తన ఓటు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయ అడ్రసుకు ఓటును మార్చుకున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తమ్ముడి బాటలోనే అన్న నాగబాబు

రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ నమోదు చేసుకున్న ఓటు దొంగ ఓటు.. అని అని చర్చ సాగుతున్న తరుణంలో.. అతని సోదరుడు నాగబాబు కూడా దొడ్డిదారిన రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదుకు పూనుకున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే నాగబాబు మొన్నటి తెలంగాణ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు అంటే 2023 డిసెంబరు 4 తేదీన మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వడ్డేశ్వరం - రాధా రంగ నగర్‌లోని 5-263 ఇంటి అడ్రసు పేరుతో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేశారు. నాగబాబు, ఆయన భార్య, కూతురు నిహారిక, కుమారుడు వరుణ్‌తేజ్ (సినీ నటుడు), కోడలు లావణ్య త్రిపాఠి (సినీ నటి) కలిపి మొత్తం ఆరుగురు ఆ ఇంటి అడ్రసులో నివాసం ఉంటున్నట్లు పేర్కొంటూ ఓట్లు నమోదు ఫారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే ప్రాథమిక స్థాయిలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) పరిశీలనలో నాగబాబు గానీ, వారి కుటుంబం గానీ ఆ అడ్రసులో నివాసం ఉండడం లేదని తేలింది. ఈ ఇల్లు జనసేన పార్టీ అభిమానిదని స్థానికులు పేర్కొన్నారు. ఆ తర్వాత కూడ మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ ఆ ఇంటి తలుపులకు నోటీసులు అంటించి వెళ్లారు. అయితే నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులందరి తరుపున సంబంధిత అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే అధికారుల ముందు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఇక్కడ నివాసం.. అక్కడ వ్యాపారమట!

అధికారుల విచారణ సమయంలో నాగబాబు తాను తాడేపల్లిలో నివాసం ఉంటున్నానని, అయితే ప్రస్తుతం వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నందున స్వయంగా విచారణకు రాలేకపోయినట్టు తాను సంతకం చేసిన ఒక పేపరు ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మరో ఇద్దరు ఇలాగే పేపర్‌పై రాసి.. దానిని ఫొటో తీసి ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మిగిలిన మరో ముగ్గురి నుంచి ఎలాంటి అఫిడవిట్ లేదని తెలిసింది. మొత్తంగా ఆ అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే నాగబాబు కుటుంబ సభ్యులు ఆరుగురి తరఫున విచారణకు హాజరయ్యారు. ఆ ఇంటి అడ్రసులో నాగబాబు కుటుంబం నివాసం ఉండటం లేదని అధికారులు నిర్ధారించుకుని, ఆ ఆరుగురి ఓట్లను తిరస్కరించారు. సినీ నటుడిగా, పార్టీ అధ్యక్షుడి హోదా లేదా కీలక బాధ్యతల్లో ఉన్న పవన్‌కల్యాణ్, నాగబాబు లాంటి వారే తమ సొంత ఓట్ల నమోదు ప్రక్రియలో ఇలా అడ్డదారులు తొక్కడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పిటిషనర్‌కు పిటిషన్ వేసే అర్హత లేదు

- తెలంగాణ హైకోర్టులో 'వ్యూహం' నిర్మాత-దర్శకుల వాదనలు
- కోర్టులు.. సమాంతర సెన్సార్ బోర్డులు కాదు: సీబీఎఫ్‌సీ
- తదుపరి వాదనల విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్ర విడుదలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇచ్చిన సర్టిఫికెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో..అసలు పిటిషన్ దాఖలు చేసే అర్హతే పిటిషనర్‌కు లేదని నిర్మాత, దర్శకులు వాదనలు వినిపించారు. పరువునష్టం వాటిల్లుతున్న చంద్రబాబు కుమారుడిగా అని పిటిషన్‌లో పేర్కొన్నారని.. అంటే అది ఆయన వ్యక్తిగత వ్యవహారమని, రిట్ పిటిషన్ మెయింటెనబుల్ కాదని పేర్కొన్నారు. అనంతరం వాదనలను తెలంగాణ హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. 10.30 విచారణ సందర్భంగా..సర్టిఫికెట్ జారీకి సంబంధించి ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని, అందులో ఎవరు ఉండాలనేది వాది, ప్రతివాదులు నిర్ణయం తీసుకొని 12 గంటలకు రావాలని సూచించారు. అయితే కమిటీ నిర్ణయంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాదనలు ప్రారంభించారు. పార్టీ జెండాలు, నేతల పేర్లతో చిత్రం తీశారని, ఇది పలు పార్టీల నేతల పరువుకు నష్టం కలిగించేదిగా ఉందని పిటిషనర్ తరుపున న్యాయవాది మురళీధర్‌రావు వాదించారు.

'సీబీఎఫ్‌సీ'లో కోర్టులు జోక్యం చేసుకోలేవు..

అనంతరం సీబీఎఫ్‌సీ తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) నరసింహశర్మ వాదనలు వినిపిస్తూ.. 'సినిమాటోగ్రాఫ్ చట్టం, ఫిల్మ్ సర్టిఫికేషన్ మార్గదర్శకాలు, ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం భావ ప్రకటన హక్కును పరిగణనలోకి తీసుకుని రివైజింగ్ కమిటీ ఏకగ్రీవంగా 'యు' సర్టిఫికెట్ మంజూరు చేసింది. చట్టప్రకారం ఆ నివేదికను రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఉంది. సీబీఎఫ్‌సీ ఒకసారి సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కోర్టులు జోక్యం చేసుకోవడానికి వీలులేదు. ఇదే జరిగితే ప్రతి సినిమాకు ఏదో కారణం చూపించి ఇక అంతా కోర్టులను ఆశ్రయిస్తారు. ఇది చిత్రాల విడుదలకు ఆటంకంగా మారుతుంది. కోర్టులు సమాంతరంగా సెన్సార్ బోర్డు పాత్ర పోషించలేవు. రివిజన్ కమిటీ చట్టప్రకారమే సర్టిఫికెట్ జారీ చేసింది. ఇది సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన ఎక్కడా జరగలేదు' అని వాదించారు.

పిటిషనర్‌కు అర్హత లేదు...

నిర్మాత-దర్శకుడి తరపున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. 'తండ్రికి పరువు నష్టం జరిగినప్పుడు కుమారుడు కోర్టుకు రావడం చట్టప్రకారం చెల్లదు. టీజర్‌కు సంబంధించిన వీడియో చూశామని పిటిషన్‌లో పేర్కొన్నారు.. దాన్ని సినిమా మొత్తానికి ఎలా ఆపాదిస్తారు. చిత్రం చూశాక అవమానం జరిగిందని భావిస్తే అప్పుడు పరువునష్టం దావా వేసుకోవచ్చు. ఇదే కోర్టు చిత్రానికి సర్టిఫికెట్ జారీ కోసం రివిజన్ కమిటీ వేయాలని సీబీఎఫ్‌సీని ఆదేశించింది. తొమ్మిది మందితో ఏర్పాటైన రివిజన్ కమిటీ అన్ని అంశాలను పరిశీలించి ఏకగ్రీవంగా సర్టిఫికెట్ జారీ చేసింది. ఇప్పుడు మళ్లీ ఇదే కోర్టు సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుబట్టడం సరికాదు. గతంలో సైరా నరసింహారెడ్డి చిత్రంపై కొందరు ఇదే హైకోర్టును ఆశ్రయించగా, చిత్రం చూడకుండానే ఆరోపణలు చేయడం సరికాదంటూ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం కొట్టివేసింది. చిత్రం చూడకుండానే పరువుకు నష్టం వాటిల్లుతుందని.. ఊహించి పిటిషన్ వేయడం ఆక్షేపణీయం. చట్టపరమైన చర్యలకు ఊహలు ప్రాతిపదిక కాదు. సీబీఎఫ్‌సీ ఇచ్చిన నివేదికను కోర్టు రహస్యంగానే ఉంచాలి. వివరాలు బహిర్గతమైతే మీడియా, సోషల్ మీడియాకు చేరే అవకాశం ఉంటుంది' అని పేర్కొన్నారు. న్యాయమూర్తి.. విచారణ బుధవారానికి వాయిదా వేశారు.

ప్రతి హైకోర్టులో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి హెచ్‌సీఏఏ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రతి హైకోర్టులో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) విజ్ఞప్తి చేసింది. హైకోర్టుల్లో వసతుల కల్పన తదితర వివరాల సేకరణ, చర్చ కోసం సుశీల్‌కుమార్ మోదీ ఆధ్వర్యంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం హెచ్‌సీఏఏలో న్యాయవాదులతో భేటీ అయ్యింది. అన్ని న్యాయస్థానాల్లో ఆన్‌లైన్ సేవలు అందించేలా ఏర్పాటు చేయాలని అసోసియేషన్ కోరింది. ఇది జూనియర్లకు వినియోగపడుతుందని పేర్కొంది. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు, కార్యదర్శులు దేవేందర్, ప్రదీప్, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్, బైరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తరలింపును ఆపాలి..

హైకోర్టు తరలింపును ఆపాలంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముందు పలువురు న్యాయవాదులు ఆందోళన చేశారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ భేటీని అడ్డుకున్నారు. హైకోర్టు తరలింపును ఆపాలని, తమ సమస్యలు వినాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అసోసియేషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కమిటీ భేటీ అర్ధాంతరంగా ముగిసింది. అనంతరం కమిటీ.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులతో సమావేశమయ్యింది.

జిల్లా వార్తలు

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం


ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వ హోం శాఖ మద్దతుతో గుజరాత్ ప్రభుత్వం పదకొండు మంది రేపిస్టులు, హంతకులను విడుదల చేయగా.. ఈ తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షణీయమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) రివల్యూషనరీ ఇన్షియేటివ్ పార్టీల కన్వీనర్ పోటు రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిల్కిస్ బానో కేసులో రేపిస్టులకు మహారాష్ట్ర హైకోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా, నేరస్తులను కాపాడటంలో గుజరాత్ బీజేపీ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వ హోం శాఖ కూడా చురుకైన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ప్రస్తుత సుప్రీం తీర్పు వారికి చెంపపెట్టులా నిలుస్తుందని తెలిపారు.

రైళ్ల రద్దు మళ్లీ పొడిగింపు



ఖమ్మంమామిళ్లగూడెం: మూడో రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా ఈ నెల 29వ తేదీ వరకు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయగా, పనులు పూర్తి కాకపోవడంతో మరికొన్నాళ్లు పొడిగించారు. ఆయా రైళ్లు ఫిబ్రవరి 25వ తేదీ వరకు నడవవని ఖమ్మం సీపీఐ జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్ - విజయవాడ (07755), విజయవాడ - డోర్నకల్ (07756), భద్రాచలంరోడ్ - విజయవాడ (07278), విజయవాడ - భద్రాచలంరోడ్(07279) రైళ్ల రద్దును పొడిగించిన విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

ఇంటర్ సొసైటీ క్రీడా పోటీలకు శిక్షణ



ఆర్చరీ సాధన చేస్తున్న క్రీడాకారులు

పాల్వంచరూరల్: ఉట్నూరులో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ సొసైటీ క్రీడోత్సవాలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 150 మంది విద్యార్థులకు పాల్వంచ మండలం కిన్నెరసానిలోని స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో మంగళవారం నుంచి శిక్షణ ఇస్తున్నారు. క్యాంప్‌ను ఏటీడీఓ చంద్రమోహన్ పర్యవేక్షించారు. వారం పాటు జరగనున్న క్యాంప్‌లో వాలీబాల్, కబడ్డీ, చదరంగం, ఆర్చరీ అంశాల్లో 15 మంది కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తున్నామని ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు తెలిపారు.

చిక్కుల్లో క్రీడాకారులు

- జాతీయస్థాయి పోటీలకు పంపించడంలో ఎస్‌జీఎఫ్ నిర్లక్ష్యం
- సొంత ఖర్చులతోనే వెళ్లాలని సూచన
- సత్తా చాటే అవకాశమున్నా స్తోమత లేక పలువురు దూరం
- క్రీడలకు బడ్జెట్ లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన



ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్రస్థాయిలో పాఠశాలల క్రీడలు నిర్వహించిన ప్రతీసారి ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతూనే ఉంది. ఈసారి కూడా రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) తీరుతో క్రీడాకారులు సతమతమవుతున్నారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడా జట్లు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నా ఎస్‌జీఎఫ్ బాధ్యులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ జిల్లాలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి పోటీలు మూడు కేటగిరీల్లో నిర్వహించగా.. జాతీయ పోటీలకు ఎంపికైన వారి జాబితా ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉంది. కానీ ఒకటికి బదులు మూడు జాబితాలు పంపడంతో నిర్వాహకులు పరిగణనలోకి తీసుకోబోమని తేల్చిచెప్పారు. దీంతో కొందరు క్రీడాకారులు జిల్లా బాధ్యులను ఆరా తీయగా అంత సవ్యంగానే ఉందని నమ్మబలికినా ఈవెంట్లలో పేర్లు లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. అంతేగాక రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించిన వారే జట్లకు కిట్లు, టీఏ, డీఏ ఇవ్వాల్సి ఉన్నా ఖర్చులన్నీ సొంతంగా భరించాలని చెప్పడంతో క్రీడాకారులు ఖంగుతిన్నారు. క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌ల ఖర్చు పూర్తిస్థాయిలో భరించాలని రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సూచించడంతో జిల్లాల బాధ్యులు ఒకటి, రెండు క్రీడాంశాలకు తీసుకెళ్లినా ఎక్కువ టోర్నీలకు తీసుకెళ్లలేక నిస్సహాయ స్థితిలో పడిపోయారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యాన ఒకే జిల్లాకు అధిక టోర్నీలు కేటాయించడంతో టోర్నీలు, జాతీయ పోటీలకు పంపడంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా ఎస్‌జీఎఫ్ తీరుతో ఖర్చు భరించలేక కొందరు నిరుపేద క్రీడాకారులు ప్రతిభ ఉన్నా జాతీయస్థాయి టోర్నీలకు వెళ్లలేకపోతున్నారు. గతంలో రాష్ట్రస్థాయి పోటీలు మొదలు జాతీయస్థాయి పోటీల వరకు మొత్తం వ్యయాన్ని ఎస్‌జీఎఫ్ భరించినా ఇప్పుడు అలా ఎందుకు చేయడం లేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మూడేళ్లుగా క్రీడలకు ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించని రాష్ట్ర ప్రభుత్వ తీరును సీనియర్ పీఈటీలు తప్పుపడుతున్నారు.

ఖరారు కాని జాతీయస్థాయి టోర్నీలు

రాష్ట్ర, జిల్లాస్థాయిలో క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఖరారు చేసిన రాష్ట్రస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రెండు క్రీడాంశాలకు మాత్రం ఇప్పటి వరకు జాతీయస్థాయి పోటీల తేదీలు ఖరారు చేయలేదు. అండర్-14, 17, 19 బాలబాలికల టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలకు జాతీయస్థాయిలో జరిగే పోటీల తేదీలు ఖరారు కాకపోవడంతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా జిల్లాస్థాయిలో ఎంపికలు జరిగినా రాష్ట్రస్థాయి పోటీలు జరిపే పరిస్థితి లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే జట్లకు రైల్వే టికెట్లలో రాయితీ పొందే అవకాశం ఉన్నా నాలుగేళ్ల కిందట నకిలీ సర్టిఫికెట్లు వెలుగు చూడటంతో పోటీలు తామే నిర్వహిస్తామని భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. కానీ, సమస్య కొలిక్కి రాకపోవడంతో రాయితీని రైల్వే శాఖ ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు స్పందించి క్రీడాకారులను ప్రోత్సహించేలా చొరవ చూపాలని ఔత్సాహికులు, సీనియర్ పీఈటీలు కోరుతున్నారు.

క్రీడలకు బడ్జెట్ నిల్

ఏటా క్రీడారంగానికి రూ.3 కోట్ల మేర బడ్జెట్ కేటాయించే వారు. కానీ, ఈసారి బడ్జెట్ లేదని రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. రాష్ట్రస్థాయి టోర్నీలను జిల్లా బాధ్యులే నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించడమేకాక జాతీయస్థాయి పోటీలకు తీసుకెళ్లే బాధ్యత కూడా వారిదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు కొన్ని జిల్లాలు మాత్రమే ముందుకొచ్చి క్రీడాపోటీలు నిర్వహిస్తుండగా మిగతా వారు దూరంగా ఉన్నారు. మూడేళ్లుగా కరోనా, జాతీయ స్కూల్ గేమ్స్‌లో జరిగిన అవకతవకలను కారణంగా చూపుతూ నిధులు కేటాయించకపోగా ఈసారి కూడా నిర్లక్ష్యం కనబర్చడంపై విమర్శలు వస్తున్నాయి. కాగా, టోర్నీ జరిపేందుకు నిధులు తాము ఇవ్వకున్నా చందాలు వసూలు చేసుకోవచ్చని ఎస్‌జీఎఫ్ బాధ్యులు సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం.

జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ పోటీలు ప్రారంభం

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కళాభారతి క్రీడామైదానంలో జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కేటీపీఎస్ 7వ దశ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ టోర్నీని కేటీపీఎస్ 5, 6వ దశ, 7వ దశ సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. నిత్యం విధినిర్వహణలో తలమునకలయ్యే ఉద్యోగులు క్రీడాపోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. క్రీడలపై మక్కువ పెంచుకుని నిత్యసాధన చేయాలని, పోటీల్లో క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. కాగా, ఈ పోటీలకు నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు, విద్యుత్ సౌధ, బీటీపీఎస్, కేటీపీపీ, కేటీపీఎస్ 5, 6, 7వ దశలు, సింగూరు, జూరాల ప్రాజెక్టుల నుంచి జట్లు హాజరయ్యాయి. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్ ఆనంద్, కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు

గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ఐటీడీఏ ప్రాంగణంలో ఇప్పమొక్క నాటుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: గిరిజన రైతులు పోడు వ్యవసాయంతో పాటు సీజనల్ పంటలు సాగుచేస్తూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన ఇప్ప మొక్కలు నాటి మాట్లాడారు. ఇంటింటికో ఇప్ప మొక్క పంపిణీలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో గ్రామాలు, అడవులు, ఇంటి ఆవరణ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తద్వారా ఇప్ప పూల సేకరణతో అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అటవీశాఖ సహకారంతో 2,500 మొక్కలను సేకరించి గిరిజనులకు పంపిణీ చేస్తున్నామని పీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, సురేశ్‌బాబు, రమణయ్య, భాస్కర్,నర్సింగరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, హాస్టళ్ల హెచ్‌ఎం, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వంద శాతం పాఠశాలలకు హాజరయేలా చూస్తూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. రోజు వారీగానే కాక వారానికోసారి పరీక్షలు నిర్వహించి వెనుకబడిన వారిపై మరింత శ్రద్ధవహించాలని సూచించారు.

అధికారి లేక అస్తవ్యస్తం

- పంట సీజన్‌లో ఖమ్మం మార్కెట్‌పై పర్యవేక్షణ కరువు
- క్రయవిక్రయాల్లో సమస్యలు
- వ్యాపారుల తీరుతో రైతుల ఇక్కట్లు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కీలక అధికారి లేకపోవటంతో నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో రెండో పెద్దదైన ఖమ్మం మార్కెట్ మిర్చి, పత్తి పంటల కొనుగోళ్లకు పెట్టింది పేరు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు పంటలను ఇక్కడకు తీసుకొస్తారు. మార్కెట్ లెక్కల ప్రకారం ఏటా రూ.3 వేల నుంచి రూ.4 వేల కోట్ల టర్నోవర్ జరుగుతుంది. అయినా మూడేళ్లుగా రెగ్యులర్ కార్యదర్శిని నియమించలేదు. 2020 జూలైలో హుజూర్‌నగర్ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశానికి బాధ్యతలు అప్పగించగా.. గత నెల 27న ఆయనను హుజూర్‌నగర్ పంపించారు. ఆ తర్వాతైనా ఖమ్మం మార్కెట్‌కు ఉన్నత శ్రేణి కార్యదర్శిని నియమించకపోవడంతో పర్యవేక్షణ కుంటుపడింది.

పంటల సీజన్‌లో అస్తవ్యస్తం

వానాకాలంలో సాగు చేసిన పంట ఉత్పత్తుల విక్రయాలు ప్రస్తుతం ఊపందుకున్నాయి. ఖమ్మం మార్కెట్‌కు పత్తి, మిర్చి పంట ఉత్పత్తులతోపాటు అపరాలు, మొక్కజొన్న తదితరాలను తీసుకొస్తున్నారు. మిర్చి 30 వేల బస్తాలు, పత్తి దాదాపు 10 వేల బస్తాల మేర వస్తుండగా కొద్ది రోజుల్లో ఇది మరింతగా పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నత శ్రేణి కార్యదర్శి ఉంటే వ్యాపారులు, రైతులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తూ గిట్టుబాటు ధర కల్పించటంలో కీలకంగా వ్యవహరిస్తారు. కానీ ఇక్కడ ఈ పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అసలే ఉద్యోగుల కొరత..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. మొత్తం 53 పోస్టులకు గాను కేవలం 17 మందే రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ మార్కెట్ పరిధిలోనే హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ కూడా ఉంది. మార్కెట్ ఉన్నతాధికారి పోస్టుతో పాటు సహాయ కార్యదర్శి, ఐదు అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్ పోస్టులు, ఒక ఎల్‌డీసీ, మూడు బిడ్ క్లర్క్, రెండు గ్రేడర్ పోస్టులు, రెండు టైపిస్టు పోస్టులు, మూడు జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్ల పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. ఇవేకాక మరిన్ని పోస్టులు అవసరమున్నాయి. మరో రెండు గ్రేడ్-2 పోస్టులు, రెండు గ్రేడ్-3 పోస్టులు, రెండు సహాయ కార్యదర్శుల పోస్టులు, సూపర్‌వైజర్ల పోస్టులు అవసరమని అంచనా. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమిస్తే నిర్వహణ ఇబ్బందులు తొలగే అవకాశం ఉండడమే కాక ఆదాయం కూడా పెరుగుతుంది.

కార్యదర్శి నియామకం ఎప్పుడు?

మార్కెట్‌కు ఉన్నత శ్రేణి కార్యదర్శిని నియమించడంలో జాప్యం చేస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ విధులు నిర్వర్తించిన మల్లేశాన్ని బదిలీ చేసి పది రోజులు దాటినా మరో అధికారిని నియమించలేదు. మార్కెట్‌లో పనిచేసే గ్రేడ్-2 కార్యదర్శికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి పని కానిచ్చేస్తున్నారు. రెండు రోజులుగా మార్కెట్‌లో మిర్చి ధర పతనమవుతుండగా ఎప్పుడేం గొడవ జరుగుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.